## రేషన్ షాపులను తనిఖీ చేసిన ఆర్డిఓ నిశాంత్‌రెడ్డి



ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న ఆర్డిఓ నిశాంత్‌రెడ్డి

కళ్యాణదుర్గం, జూన్ 1 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో గల రేషన్ షాపు నెంబర్-52లో రెవెన్యూ డివిజన్ అధికారి ఎ.నిషాంత్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ బియ్యం, నిత్య అవసర సరుకుల స్టాక్, పంపిణీ వివరాలను పరిశీలించారు. రేషన్ డీలర్ పని తీరును, రేషన్ బియ్యం పంపిణీపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం తహశీల్దారు, ఇ.ఫణికుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ నాయకుల జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్, జూన్ 1 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గం, ఎన్టీఆర్ భవన్‌లో సీనియర్ నాయకులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, కళ్యాణదుర్గం మండల ఐటిడిపి కోఆర్డినేటర్ వర్లి రాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైలునుండి క్రింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే ప్రక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి శవం దృశ్యం

పుట్టపర్తిరూరల్, జూన్ 01, ప్రభాతవార్త

నారాయణపురం, పుట్టపర్తి రైల్వే స్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు నుండి క్రింద పడి మృతి చెందడం జరిగిందని హిందూపురం రైల్వే పోలీస్ అధికారులు తెలియజేశారు. గురువారం ఉదయం 10 గంటలకు ముందు ఒక మగ వ్యక్తి సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఏదో కారణం చేత రైలు నుండి క్రిందకు పడి మరణించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. మృతుడు 5.5 అంగుళాల ఎత్తు,చామఛాయతో ఎర్రటి మొలతాడు, మెడ, చేతికి పసుపుదారం, నీలం రంగు రెడీమేడ్ షర్టు, కలర్‌ప్యాంట్, వైట్‌కలర్ బనియన్, ధరించి ఉన్నాడని, మృతుడిని గుర్తించడానికి ఎటువంటి ఆనవాళ్ళు లేవన్నారు. కనుక మృతునిని ఎవరైనా గుర్తించిన యెడల హిందూపురం రైల్వే పోలీసులకు చెందిన 9440627641,9441238182 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ

- మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, ఎంపీ వై.దేవేంద్రప్పలు

బళ్లారి, జూన్01, ప్రభాతవార్త

ఇటీవల జరిగిన విధానసభ ఎన్నికల్లో బళ్లారి సిటీ క్షేత్రంలో బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు జరిపిన వారికి నోటీసులు జారీ చేసినట్లు, అయితే ఇప్పటివరకు వారి నుంచి ఎటువంటి సమాధానం లేదు. నియమానుసారం ఐదు నోటీసులు జారీ చేసిన అనంతరం పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో పత్రికాగోష్టిలో మాట్లాడారు. ఎన్నికల్లో తన ఓటమికి కారణం కేఆర్‌పీపీ పార్టీయే కారణమని, తన ఓటు బ్యాంకును ఆ పార్టీ చీల్చిందని తెలిపిన ఆయన, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు గ్యారెంటీ యోజనల గురించి ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించిందని, ఈ కారణంగానే బళ్లారి నగరంతో పాటు జిల్లాలో బీజేపీ ఓటమి పాలయ్యిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు జరిపిన వారు ఎవరైనా సరే పార్టీ తీసుకునే కఠిన చర్యలకు గురికావాల్సిందేనని చెప్పారు. బీజేపీ కార్పొరేటర్‌లు కల్పనా వెంకటరామిరెడ్డి, కోనంకి తిలక్‌కుమార్, కె.ఎస్.అశోక్‌కుమార్‌లు ముగ్గురు బీజేపీ నుంచి గెలిచి కార్పొరేటర్లుగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేఆర్‌పీపీ పార్టీకి చేరుకుని బీజేపీకి వ్యతిరేకంగా కార్యం నిర్వహించారు. దీనిని పార్టీ నేతలు గమనించారని, ఈ ముగ్గురికి నోటీసులు ఇప్పటికే జారీ చేసినట్లు తెలిపిన ఆయన, ఇప్పటివరకు వారి నుంచి సమాధానంలేదని, మహానగరపాలికెలో వారి సభ్యత్వానికి తప్పక ఆపద ఉంటుందని చర్యలు తప్పవని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాల పాటు విజయవంతమైన పాలన పూర్తి చేసిందని, ఇప్పటివరకు కోట్లాది రూపాయల గ్రాంట్లను వివిధ అభివృద్ధి పనులకు విడుదల చేసిందని, తమది అభివృద్ధి మంత్రమని తెలిపిన ఆయన, ఈసారి జరిగిన ఎన్నికల్లో తమ అభివృద్ధి ఓటమిపాలయ్యిందని, కాంగ్రెస్ అబద్ధాల గ్యారెంటీ మూట గెలిచిందని, ప్రజల మొగ్గు బీజేపీ వైపు ఉన్నదని, తిరిగి పార్టీని అట్టడుగు స్థాయి నుంచి సంఘటిత పరిచి జిల్లాలో కమలాన్ని విరబూస్తామని, ఇందులో అనుమానమే లేదని చెప్పారు. ఈ సందర్భంలో ఎంపీ వై.దేవేంద్రప్ప, ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌నాయుడు, సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప, రైతుమోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎస్.గురులింగన్నగౌడ, డా.బి.కె.సుందర్. జిల్లా ఉపాధ్యక్షురాలు డా.అరుణాకామినేని తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యాన్ని పట్టుకున్న సెబ్ పోలీసులు

కంబదూరు,జూన్ 1,ప్రభాతవార్త



కర్ణాటక నుండి ఆధ్రప్రదేశ్ అయిన కంబదూరు ప్రాంతానికి అక్రమ మద్యం తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను ద్విచక్ర విహానాన్ని అనంతపురం సెబ్ పోలీసులు పట్టుకున్నారు.కర్ణాటక ప్రాంతమైన చిన్నపల్లి పెద్దపల్లి నుండి ఎక్కువగా కర్ణాటక మద్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రాతానికి తరలిస్తుండడంతో ఏపీ పోలీసులు గట్టి నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో మద్యం తీసుకోస్తుండగా పాత పెట్రోల్ బంకు వద్ద సెబ్ పోలీసులు నిందుతులను పట్టుకుని స్టేషన్‌కు తీసుకెల్లారు.దీనికి సంబందించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని సెబ్ సీఐ మోహుద్దీన్ భాషా తెలిపారు.

## విద్యార్థుల బియ్యాన్ని అక్రమంగా అమ్ముకున్న డీలర్

- స్కూల్ కమిటీ అధ్యక్షులు నాగరాజు
- విచారణలో బియ్యం కట్టిస్తామన్న డీలర్

బొమ్మనహాళ్, జూన్ 1 ప్రభాతవార్త



విచారణ నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోగల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల మధ్యాహ్నభోజనం నుంచి 2023 మార్చి కోట నుంచి బియ్యం మాయం అయినట్లు ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది, ఈ విషయమై జిల్లాలో జరిగే స్పందన కార్య క్రమంలో స్కూల్ కమిటీ అధ్య క్షులు నాగరాజు, ప్రధానోపా ధ్యాయులు రాజ్‌కుమార్ జిల్లాక లెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. వారి ఫిర్యాదు మేరకు డిటి భోగన్నగౌడ్, ఆర్ఐ బాలకృష్ణ, విఆర్ఓ ఫర్వీన్‌భాను, సంబంధిత విషయంపై విచారణ నిర్వహించి తహశీల్దారు శ్రీనివాసులుకు నివేదిక అందించారు. ఆ నివేదికలో 9 క్వింటాళ్ల 81 కెజిల బియ్యం డీలర్ మాయం చేశాడని, ఆ బియ్యాన్ని పాఠశాలకు ఇవ్వాలని అధికారులు డీలర్‌కు తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా తహశీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులకు మధ్యాహ్న భోజన బియ్యాన్ని సక్రమంగా పాఠశాలకు అందించాలని అలా అందించని డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉద్యోగం జీవితంలో ఒక భాగం

- మల్లన్నకు ఉద్యోగమే జీవితం
- రైల్వే గార్డు మల్లన్న సన్మాన సభలో వక్తలు



రైల్వే గార్డ్ మల్లన్నను సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్, జూన్ 1 ప్రభాతవార్త

సహజంగా ఎవరైనా ఉద్యోగాన్ని జీవితంలో ఒక భాగంగా చూస్తారని, రైల్వే గార్డ్ మల్లన్న ఉద్యోగమే జీవితంగా బతికారని పలువురు వక్తలు కొనియాడారు. పదవీ విరమణ పొందిన మల్లన్న సన్మాన సభలో రైల్వే ఉద్యోగులు, అధికారులు మాట్లాడుతూ.. ఒకప్పుడు రైలు రోడ్డు నిర్మాణానికి కంకర మోసి, కష్టపడి ఎదిగి రైల్వేగార్డు స్థాయికి చేరుకున్న కసాపురం సి.మల్లన్న సేవలు మరువలేనివన్నారు. ఆయన సేవలు నేడు ఎందరో ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచాయి అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో భాగమైన గుంతకల్ డివిజనల్‌లో రైల్వే గార్డు మల్లన్న పదవి విరమణ చేయడంతో ఒక నిజాయితీపరుడు అయిన ఉద్యోగి సేవలకు తమ శాఖా దూరం అయిందన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆయన జీవితం మొత్తం రైల్వే ప్రయాణికుల భద్రతకు కేటాయించడం జరిగిందన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం రైల్వే గ్యంగ్ మెన్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన కీ మ్యాన్‌గా పదోన్నతి పొందారని వివరించారు. ఏ పనీ చేసినా బాధ్యతతో, నిజాయితీతో నిర్వహించారని తెలిపారు. మంచితనంతో, విశ్వాసంతో అధికారుల మన్ననలు అందుకున్నారు అని కొనియాడారు. మంచి నడవడి వ్యక్తిత్వం ఆయన సొంతమని ప్రశంసించారు. అని శేష జీవితం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో కొనసాగాలని అభిలషించారు. సన్మాన సభలో రైల్వేశాఖాధికారులు, సహోద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వార్షికోత్సవం

శ్రీసత్యసాయిజిల్లా (వైద్యం), జూన్ 01, ప్రభాతవార్త



వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ గౌడ్

పుట్టపర్తి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో ఆ బ్యాంక్ అవతరణ దినోత్సం సంద ర్భంగా 17వ వార్షికోత్స వంను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ బ్యాంక్ పుట్టపర్తి శాఖ మేనేజర్ వి.సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, అతి తక్కువ వడీ రేట్లతో బంగారు రుణాలు, గృహ నిర్మాణ, విద్య, వ్యాపార, పంట రుణాలు, మహిళా సంఘాలకు, వ్యవసాయ అనుబంధ సంఘాలకు రుణాలను త్వరితగతిన మంజూరుచేయడం జరుగుతోందన్నారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తున్నామని, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపిఐ అన్నిరకాల డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయాలు కలవన్నారు. ఈ సందర్భంగా బ్యాంకులో అందించే సేవలపై ఖాతాదారులు సంతృప్తివ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రగతి గ్రామీన బ్యాంక్ పుట్టపర్తి శాఖ మేనేజర్ వి.సత్యనారాయణ గౌడ్, ఫీల్డ్ ఆఫీసర్ పి.సుబ్బిరెడ్డి, డిప్యూటీ మేనేజర్ నాగారు ్జన, వెంకటేశ్వర్లు, క్యాషియర్ సి.హెచ్.వీరాస్వామినాయుడు, ఆధార్ ఆపరేటర్ నరేష్ పాల్గొన్నారు.

## ఉరవకొండ పట్టణంలో పారిశుద్ధ్య పనులు

-పనులను పర్యవేక్షించిన పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, జూన్ 1 ప్రభాతవార్త



రాయంపల్లి క్రాస్ రోడ్డు హైమాక్స్ లైట్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

పట్టణంలో గురు వారం పారిశుద్ధ్య పను లను పంచాయతీ కార్య దర్శి ఎ.గౌస్ సాహెబ్ పర్యవేక్షించారు. స్థానిక 4వ వార్డు మాలవీధి, కామన్నకట్ట ప్రాంతం, పంచాయతీ కార్యాల యం ఎదురుగా సత్యనారాయణ పేటలో పర్యటించిన ఆయన దగ్గరుండి మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి పొడి సున్నం చల్లించారు. అనంతరం 1వ వార్డు ఉల్లిగడ్డల వీధిలో నీటి సిస్టం ట్యాంకులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. స్థానిక రాయంపల్లి క్రాస్ రోడ్డు కూడలిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న హైమాక్స్ లైట్ల పిల్లర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదరి ్శ ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ త్వరలో పట్టణంలో పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరుగుతుందన్నారు.

## జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించిన ఎంఈఓ సాయి కృష్ణ


కంబదూరు,జూన్ 1,ప్రభాతవార్త



కిట్లను పరిశీలిస్తున్న దృశ్యం

కంబదూరు మండలం లోని జగనన్న విద్యా కానుక మండల స్టాక్ పాయింట్ నందు నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలను, బ్యాగ్‌లను బెల్టులను ఎంఈఓ సాయి కృష్ణ పరిశీలించారు. త్వరలోనే అన్ని పాఠశాలలకు కిట్లను పంపిణి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది,పార్ట్ టైం ఇన్స్పెక్టర్స్,సీఆర్పిలు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే విశ్వ



వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి

విడపనకల్లు, జూన్ 1 ప్రభాతవార్త

మండలంలోని గడేకల్లు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు బందినకల్ ఎర్రిస్వామి కుమారుడు మంజునాథ, గీతాంజలిల వివాహానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైసిపి ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను ఎంపిపి కరణం పుష్పావతి, వరుని తల్లిదండ్రులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో వైకాపా నాయకులు కరణం భీమ్‌రెడ్డి, ఎంపిటిసి ఓబులేసు, సర్పంచు సుశీల, ఉమాశంకర్, వైసిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహాలకు హాజరైన యువనేత

విడపనకల్లు, జూన్ 1 ప్రభాతవార్త



వధూవరులను ఆశీర్వదిస్తున్న యువనేత వై.భీంరెడ్డి

మండలంలోని గడేకల్లు గ్రామంలో గురువారం జరిగిన పలు వివాహాలకు యువనేత, ఎంఎల్‌సి శివరామిరెడ్డి తన యుడు, జిల్లా ఖోఖో అధ్యక్షులు భీమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వ దించారు. అనంతరం వైసిపి నాయకులు యువనేత భీమిరెడ్డిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో దేనేకల్లు రాంబాబు, మాజీ సర్పంచు పంపావతి, తిమ్మాపురం ఉపసర్పంచు రాము, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనా న్నరు.

## కమనీయం శ్రీగంగాపార్వతీ సమేత భోగలింగేశ్వరస్వామి కళ్యాణం

-హాజరైన పాల్తూరు కల్లుహోలే మఠం పీఠాధిపతి చెన్నవీరశివాచార్యస్వామి, కొక్కరచేడు శరణమ్మ అవ్వ



కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

విడపనకల్లు, జూన్ 1 ప్రభాతవార్త

మండలంలోని ఉండబండ గ్రామంలో పురాతన శ్రీభోగలింగేశ్వరస్వామి ఆల యంలో గురువారం గోపురం కలశ ప్రతిష్టాపన, శ్రీగంగాపార్వతీ సమేత శ్రీభోగ లింగేశ్వరస్వామి కళ్యాణం కన్నులపండువగా జరిగింది. తెల్లవారుజాము నుండే శ్రీభోగలింగేశ్వరస్వామి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు మహా రుద్రా భిషేకం, బిల్వార్చన, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రో క్తంగా గోపుర కలశ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి శ్రీగంగా పార్వతీ సమేత శ్రీభోగలింగేశ్వరస్వామి కళ్యాణం కమనీయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కళ్యాణోత్సవం తరువాత హోమం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు కల్లుహోలే మఠం పీఠాధిపతి చెన్న వీరశివాచార్యస్వామి, కొక్కరచేడు శరణమ్మ అవ్వ, గ్రామస్తులు శంకర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, ప్రకాష్ గౌడ్, గంగాధర్‌స్వామి, రాజన్నగౌడ్, ఉమామహేశ్వరస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

## బ్యాంక్ మేనేజర్ బదిలి

- ఘనంగా సన్మానించిన సిబ్బంది

రొద్దం, జూన్ 1,ప్రభాతవార్త



బ్యాంక్ మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రొద్దం కెనరా బ్యాంక్ మేనేజర్ వంకటరమణ భువనేశ్వర్ బదిలి కావడం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు, వ్యాపారస్తులు మేనేజర్ వెంకటరమణను ఘనంగా సన్మానించారు. ఈ సభకు హాజరైన పలువురు మాట్లాడుతూ దాదాపు మూడు సంవత్సరాలుగా ఎనలేని సేవలు అందిచడం జరిగిందని,బ్యాంక్ సిబ్బంది,ఖాతాదారులు, రైతులు,గ్రామస్తులతో మమేకమై ఎక్కడ వివాదాలకు తావు లేకుండా అందరితో కలసి మెలసి సానుకూలంగా సేవలందించడం జరిగిందన్నారు.బదిలి అయిన వెంకటరమణ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన రోజుల్లో కోద్దిగా ఇబ్బంది ఉన్న రాను రాను అందరి సహకారంతో బాధ్యతలు చేపట్టానని,నాకు సహకారాన్ని అందిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసు ఉంటున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ప్రజలు,రైతులు,వ్యాపరస్తులు పాల్గొన్నారు.

## చోరీ కేసును మూడు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు..!

-8.5 తులాల బంగారు, 47.9 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



నిందితుడు షికారి రాజుతో యుపీఎస్ సీఐ వి.హరినాధ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బంది

ఉరవకొండ, జూన్ 1 ప్రభాతవార్త

గతనెల 28వ తేదీన ఉరవకొండ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో రెండిళ్లలో జరిగిన చోరీ కేసును ఉరవకొండ పోలీసులు కేవలం మూడు రోజుల్లోనే చేధించారు. దొంగల ముఠాలోని షికారి రాజు అనే వ్యక్తిని అరెస్టుచేసి అతనివద్ద నుండి చోరీకు గురైన 8.5 తులాల బంగారు, 47.9 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యుపీఎస్ సీఐ వి.హరినాధ్ ఎస్ఐ టి.పి. వెంకటస్వామితో కలిసి అరెస్టు వివరాలను వెల్లడించారు. వివరాల్లోకి వెళితే...

పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ నజీర్, కార్పెంట్ బోయ దయానంద్ ఇంటి తాళాలను పగులగొట్టి ఇళ్లల్లోకి ప్రవేశించిన గుంతకల్లు పట్టణానికి చెందిన షికారి రాజు అలియాస్ షికారి ఫైజీ, షికారి మద్దిలేటి, షికారి పప్పు, షికారి బోండంలు రాడ్లతో బీరువాలు తెరిచి నగలను ఎత్తుకెళ్లిపోయారన్నారు. బాధితుల పిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తును ముమ్మరం చేయడం జరిగిందన్నారు. ఈక్రమంలో 31వ తేదీన బుధవారం సాయంత్రం దొంగల్లో ఒకరైన షికారి రాజు దొంగలించిన బంగారు ఆభరణాలను బళ్లారికి వెళ్లి అమ్ముకుందామని గుంతకల్లు నుండి బళ్లారికు ఉరవకొండ మీదుగా వెళ్తూ మార్కెట్ యార్డువద్ద ఆగివుండగా అక్కడికి చేరుకొని అతన్ని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అతని వద్ద నుండి 4,83,530 రూపాయలు విలువగల 8.5 తులాల బంగారు, 47.9 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అరెస్టు చేసిన షికారి రాజుపై గుంతకల్లు వన్‌టైన్, టూ టౌన్, రూరల్, కసాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇదివరకే 11 చోరీ కేసులు ఉన్నాయన్నారు. మిగిలిన ముగ్గురు నిందితులను త్వరలో అరెస్టు చేస్తా మన్నారు. చోరీ కేసు ఛేదింపులో కానిస్టేబుళ్ల వి.రవికుమార్, లక్ష్మినారాయణ, కె.అశోక్‌కుమార్, సి.బాలక్రిష్ణ, పి.కులశేఖర్‌రెడ్డి, కె.సోమశేఖర్‌లు మంచి ప్రతిభ కనబర్చారని వారిని సీఐ వి.హరినాధ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి అభినందించారు.

## సొంత ఖర్చుతో కల్వర్టును నిర్మించిన టీడీపీ కార్యకర్తలు

ఉరవకొండ, జూన్ 1 ప్రభాతవార్త



కల్వర్టును నిర్మించిన టీడీపీ కార్యకర్తలు

పట్టణంలోని 10వ వార్డు ఎస్సీ కాలనీలో గురువారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సొంత నిధులు 20వేల రూపాయలతో కల్వర్టును నిర్మించి కాలనీ ప్రజల మన్ననలు అందుకున్నారు. కాలనీలోని మురుగునీటి కాలువపై కల్వర్టు లేకపోవడంతో పాదచారులు, వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతుండగా గమనించిన టీడీపీ కార్యకర్తలు మీనుగ పెద్దన్న, మీనుగ శివ, మీనుగ కేశవ్, మీనుగ గోవర్ధన్, జి.ఎర్రిస్వామి చేయిచేయి కలిపి కల్వర్టును నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నాయకులు పయ్యావుల కేశవ్ సహకారంతో కల్వర్టును ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు చేయాల్సిన పనిని టీడీపీ కార్యకర్తలు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించండి



ఐసీడీఎస్ పీడీ శ్రీదేవికు వినతిపత్రం అందిస్తున్న మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజినేయులు

ఉరవకొండ, జూన్ 1 ప్రభాతవార్త

ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల పరిధిలోని అద్దెభవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి మౌళిక వసతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాలరామాంజినేయులు కోరారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి గురువారం వజ్రకరూరు మండల కేంద్రానికి రాగా ఆమెను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బాలరామాంజినేయులు మాట్లాడుతూ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన మౌళిక వసతులులేక అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు వాలంటీర్లకు వందనం సన్మాన కార్యక్రమం

ఉరవకొండ, జూన్ 1 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు 2వ తేదీన శుక్రవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు అందించి సన్మానించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లత్తవరం రోడ్డులోగల తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు గ్రామీణ ప్రాంత వాలంటీర్లకు, మధ్యాన్నం 2 గంటలకు పట్టణంలోని వాలంటీర్లకు సన్మానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిధిగా హాజరవుతారని ప్రజాప్రతినిధులు తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.

# పట్టపగలే రూ.8 లక్షల నగదు చోరీ..!

-బ్యాంకులో డబ్బు డ్రా చేసుకొని స్కూటర్ బాక్సులో పెట్టగా మాయం -బ్యాంకు, సబ్ రిజిస్ట్రార్ ప్రాంతాల్లో పోలీసుల ముమ్మర విచారణ

-బాధితుడిని బైక్‌లో ముగ్గురు వ్యక్తులు అనుసరించినట్టు సీసీ కెమెరాలో నమోదు



రామన్న, అతని కుమారుడు చెన్నకేశవులను విచారిస్తున్న సీఐ వి.హరినాధ్



కెనరా బ్యాంకులో సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్న ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బంది



ద్విచక్రవాహనంపై వెళుతున్న అనుమానితులు (సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం)

ఉరవకొండ, జూన్ 1 ప్రభాతవార్త

పట్టణంలో గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 8 లక్షల రూపాయల నగదు చోరీకు గురైంది. మండల పరిధిలోని వెలిగొండ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే తలారి రామన్న ప్లాటు రిజిస్ట్రేషన్ నిమిత్తం స్థానిక కెనరా బ్యాంకులో 8 లక్షల రూపాయలను డ్రా చేసి టవల్‌లో చుట్టి తన స్కూటర్ బాక్సులో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అక్కడి నుండి ఎదురుగా రోడ్డుకు ఇవతలివైపునగల డాక్యుమెంట్ రైటర్ బాలచంద్ర వద్దకు వచ్చి చూసుకోగా స్కూటర్ బాక్సులో నగదు కనబడలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన రంగప్రవేశం చేసిన యుపీఎస్ సీఐ వి.హరినాధ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి బృందం విచారణ చేపట్టింది. కెనరా బ్యాంకుకు చేరుకొని బాధితుడు బ్యాంకులో నగదు ఎన్నిగంటలకు డ్రా చేశాడు..బయటకు ఎప్పుడెల్లాడు అతనివెంట మరెవరైనా ఉన్నారా అన్న విషయాలపై బాధితుడితోపాటు అతని వెంటవున్న కొడుకు చెన్నకేశవులతో ఆరా తీయడంతోపాటు బ్యాంకు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడి నుండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంతం చేరుకొని బాధితుడు కలవడానికి వెళ్లిన డాక్యుమెంట్ రైటర్ దుకాణమున్న రోడ్డులోని ఇతరత్రా దుకాణాల్లోగల సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. అయితే తలకు టోపీలు, ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంలో బాధితుడు రామన్నను అనుసరించినట్లు గుర్తించారు. వారెవరు ఏ ప్రాంతానికి చెందినవారన్న విషయమై ముమ్మరంగా గాలింపు నిర్వహిస్తున్నారు.

